# సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025




## 'ఎమ్మెల్సీ'కి నామినేషన్లు!

కరీంనగర్ – మెదక్– నిజామాబాద్ – ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ నామినేషన్లకు రంగం సిద్ధమైంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

- వివరాలు 8లో▸




గరిష్టం/కనిష్టం
34.0/20.0

**వాతావరణం**
చాలా వరకు ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత కొంతమేర పెరగనుంది. రాత్రి చలి ప్రభావం తగ్గనుంది.

## న్యూస్‌రీల్

### రిమ్స్‌లో అసంక్రమిత వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు



ఎన్‌సీడీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న వారికి రిమ్స్‌లో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లినిక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌సీడీ క్లినిక్ ద్వారా అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, అదనపు డీఎంహెచ్‌వో గజానంద్, టీబీ నివారణ అధికారి సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు యథావిధిగా ప్రజావాణి

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేడు యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లావాసులు విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

### 'క్రిప్టో' పెట్టుబడులపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: క్రిప్టో కరెన్సీ పెట్టుబడి స్కీమ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా ఆదివారం 'సాక్షి'తో తెలిపారు. సైబర్ నేరగాళ్లు అధిక లాభాల ఆశ చూపి ఫేక్ ఎక్స్ఛేంజీలు,ఫోన్‌జీ స్కీమ్‌లు,ఫిషింగ్ దాడుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నిజమైన సంస్థలను నిర్ధారించుకోవాలని, నమ్మదగిన క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లలో మాత్రమే ట్రేడ్ చేయాలని సూచించారు. ఎవరైనా మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఖాతాలు సురక్షితంగా ఉంచడానికి పాస్‌వర్డులు మార్చుతూ ఉండాలని సూచించారు.

### నృసింహుని సన్నిధిలో జిల్లా జడ్జి పూజలు



న్యాయమూర్తి దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఆదిలాబాద్ జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. పూజలు నిర్వహించారు.

- తాంసి మండలంలోని కప్పర్లకు చెందిన ఓ కుటుంబం శనివారం మూకుమ్మడిగా పురుగుల మందు తాగి అఘాయిత్యానికి పాల్పడింది. ఇంటి పెద్దతో పాటు ఆయన భార్య, మరదలు ముగ్గురూ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో కుటుంబ పెద్దతో పాటు ఆయన మరదలు మృతి చెందారు. మృతుడి భార్య రిమ్స్‌లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఆయన ఓ వ్యక్తికి రూ.60లక్షలు ఇచ్చినట్లు సూసైడ్ నోట్‌లో రాశాడు. తాను కూడా చాలా మంది వద్ద అప్పులు తీసుకున్నానని, ఇచ్చిన అప్పులు రాక, తీసుకున్న వారికి సంజాయిషీ ఇచ్చుకోలేక అందరం తనువు చాలిస్తున్నట్లుగా అందులో పేర్కొన్నాడు. కుటుంబంలో మిగిలిన వారు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఎదురైంది. గతంలో ఆయన తల్లిదండ్రులు సైతం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడడం గమనార్హం.
- ఇటీవల ఇంద్రవెల్లి మండలంలోని పిప్పిరి గ్రామానికి చెందిన ఓ రైతు ప్రైవేట్ బ్యాంక్‌లో రూ.2లక్షల అప్పు తీసుకున్నాడు. ఆయనకు మూడెకరాల భూమి ఉంది. దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. మానసికంగా ఆందోళనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. ఆయనకు భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురైంది.
- బేల మండలంలోని రేణుగూడకు చెందిన ఓ రైతు తన భార్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.3లక్షల 40వేల రుణం తీసుకున్నాడు. వాయిదాలు సైతం చెల్లించాడు. రెండు వాయిదాలు చెల్లించకలేకపోయాడు. వడ్డీతో కలిపి ఇంకా రూ.3లక్షల 80వేల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే సాగు కలిసిరాక ఆర్థికంగా నష్టపోయాడు. బ్యాంకు అధికారులు తీసుకున్న అప్పు చెల్లించాలని ఇబ్బందులకు గురిచేశారు. మనోవేదనకు గురైన ఆ రైతు బ్యాంకులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఎదురైంది. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు.

# ప్రాణాలు తీస్తున్న అప్పులు



బ్యాంకులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో రైతు (ఫైల్)



కప్పర్లకు చెందిన కుటుంబం ఆత్మహత్యకు పాల్పడగా కన్నీరుమున్నీరవుతున్న బంధువులు (ఫైల్)

- తీర్చలేక కొందరి బలవన్మరణాలు
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు
- జిల్లాలో చోటు చేసుకుంటున్న ఘటనలు

ఆదిలాబాద్‌టౌన్: అప్పులు ప్రాణాలు తీస్తున్నాయి. కొందరు వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయి అఘాయిత్యాలకు పాల్పడుతుండగా, మరి కొందరు రైతులు పంటలకు చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారు. బ్యాంకర్లు, ప్రైవేట్ వ్యాపారులు ఇబ్బందులకు గురిచేయడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంతమంది యువకులు ప్రైవేట్ యాప్‌లలో లోన్ తీసుకొని వాటిని చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంకొందరు చేసిన అప్పులను వారికి ప్రావీణ్యం లేని వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టి అప్పుల్లో కూరుకుపోతున్నారు. అయితే కొందరు సమాజంలో అందరికంటే భిన్నంగా జీవించాలనే స్వార్థంతో స్థాయికి మించి ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్నారు. ఏదో ఒక సంస్థను ఏర్పాటు చేసి రుణాలు ఇస్తామని వారి నుంచి డబ్బులు తీసుకుంటూ తీరా దుకాణాలను ఎత్తేస్తున్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. సొసైటీలను ఏర్పాటు చేసి గ్రామాల్లో తిరుగుతూ మొదట కొంత డబ్బులు తీసుకొని సభ్యులుగా చేర్చుకుంటున్నారు. రుణాలు ఇస్తామని చెప్పి కనబడకుండా పోతున్నారు. అయితే రుణాలు తీసుకున్న వారు చెల్లించలేక తనువు చాలిస్తున్నారు.

### రోడ్డున పడుతున్న కుటుంబాలు..

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలకు ఒడిగట్టే వారి కుటుంబాలు ఆధారాన్ని కోల్పోతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచి కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన వారే ఆఘాయిత్యానికి పాల్పడుతుండడంతో కుటుంబాల్లో అంతులేని వేదన మిగులుతుంది. భార్యకు భర్త దూరం కాగా, పిల్లలు తల్లిదండ్రులు లేని అనాథలుగా మిగిలిపోతున్నారు. వారి మరణంతో అప్పులు తీరుతాయా అనుకుంటే అదీ లేదు.. అప్పులు తీర్చలేని వారు క్షణికావేశంలో ప్రాణాలు పోగొట్టుకుంటుండగా, అప్పు ఇచ్చినవారు కూడా అవి రాబట్టుకోలేక, వారిని ఏం చేయలేక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### ప్రాణాల మీదకు తెస్తున్న అప్పులు..

తీసుకున్న అప్పులు ప్రాణాలు తీసేలా చేస్తున్నాయి. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారు బంధువులు, వ్యాపారులు, బ్యాంకుల వద్ద అప్పు తీసుకుంటున్నారు. స్థాయికి మించిన చేసి ఎలా తీర్చాలో తెలియక అవస్థలు పడుతున్నారు. సమాజంలో గొప్పగా బతకాలని, పక్కవారిని చూసి వారిలా హుందాగా మెలగాలనే ఆరాటంతో స్థోమతకు మించి అప్పుల పాలవుతున్నారు. ఆదాయం అంతగా లేకపోవడం, చేసిన అప్పులతో పెట్టిన వ్యాపారాలు సక్సెస్ కాకపోవడం, అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు పెరగడం, సమాజంలో తమకు ఉన్న గౌరవం పోతుందనే వేదనతో మరో మార్గం లేక తనువు చాలించాలని నిర్ణయించుకుంటున్నారు. ఇటీవల జరిగిన ఘటనలన్నీ ఇవే కారణంతో చోటు చేసుకోవడం విస్మయానికి గురిచేస్తుంది. సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ వాటిని నలుగురితో పంచుకుంటే చులకన అవుతామని ఉద్దేశంతో అందుకు వెనుకడుగు వేస్తున్నారు. లోలోపల మదనపడుతూ అప్పులు తీర్చే దారి కనిపించకపోవడంతో బలవన్మరణాలకు ఒడిగడుతూ జీవితానికి ముగింపు పలుకుతున్నారు.

### స్థాయికి మించి అప్పులు చేయొద్దు..



స్థాయికి మించి అప్పులు చేయడంతో ఇబ్బందులు తలెత్తుతాయి. అనవసరంగా అప్పులు చేయవద్దు. చెప్పిన సమయంలో చెల్లించకపోతే అప్పు ఇచ్చిన వారు ఇబ్బందులు పెడతారు. సున్నిత మనస్తత్వం గల వారు తీసుకున్న అప్పు తీర్చలేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఆత్మహత్య శరణ్యం కాదు.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. కుటుంబ పెద్దలతో కౌన్సెలింగ్ తీసుకోవాలి. అప్పులు చేయడం కుటుంబాల్లో కూడా గొడవలకు దారి తీస్తోంది. గుర్తింపు లేని సొసైటీలు, ప్రైవేట్ చిట్టీల వద్ద డబ్బులు కట్టవద్దు.

– ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

### వారి కదలికలను గుర్తించాలి..



ఆత్మహత్య చేసుకునే వారి కదలికల్లో మార్పులు వస్తాయి. వారికి వార్నింగ్ టైమ్ ఉంటుంది. హుషారుగా ఉన్నవారు డల్‌గా మారుతారు. డల్‌గా ఉన్న వారు మాట్లాడటం, కొత్త అలవాట్లు చేసుకోవడం, అతిగా మద్యం సేవించడం వంటివి కనిపిస్తాయి. వారి మాటల్లో బాధ, ప్రవర్తనలో మార్పులు కనిపిస్తాయి. వాటిని కుటుంబీకులు గమనించి మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి. మందులతో వారిలో మార్పు తీసుకురావచ్చు.

– ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణుడు, రిమ్స్

# 'వసంత' వైభవం



విద్యుద్దీపాల కాంతిలో వెలిగిపోతున్న బాసర సరస్వతీ ఆలయం

- రెండోరోజూ కొనసాగిన వేడుకలు
- ఆలయంలో పటిష్ట బందోబస్తు
- ఇబ్బంది పడ్డ సామాన్య భక్తులు

భైంసా/బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు కొనసాగుతున్నాయి. రెండోరోజైన ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. వేకువజాము నుంచే క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు.

**కాలినడకన వేలాది మంది..**
ఏటా వసంత పంచమి పర్వదినాన నిర్మల్, నిజామాబాద్‌తోపాటు మహారాష్ట్ర నుంచి వేలాదిమంది భక్తులు బాసరకు పాదయాత్రగా వస్తుంటారు. ఇలా సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చిన భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. పాదయాత్రగా వచ్చిన భక్తులను నేరుగా దర్శనానికి పంపాలని నాలుగేళ్లుగా వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అలాగే సామాన్య భక్తులూ ఇబ్బందులు పడ్డారు. ప్రాంగణంలో నిరీక్షించేందుకు ప్రత్యేక స్థలం కేటాయించలేదు. ఇక అన్నదాన సత్రాల వద్ద ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. దర్శనానికి క్యూలో గంటలతరబడి నిల్చున్న భక్తులకు తాగునీరు, పాలు అందించలేదు.

**ఎటు చూసినా భక్తజనమే..**
బాసర గోదావరి తీరంలో ఎటు చూసినా భక్తులే కనిపించారు. ముందుగా స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలాచరించారు. గంగమ్మతల్లికి పూజలు చేశారు. సూర్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత కాళీమాత ఆలయంలోనూ పూజలు చేశారు. వ్యాసగుహ వద్ద భక్తుల సందడి కనిపించింది. దుకాణాలు సందడిగా మారాయి. చాలామంది యాత్రికులు కుటుంబ సభ్యులతో గోదావరి నదిలో బోటింగ్ చేశారు.

**నేడు మరింత రద్దీ..**
ఏటా సరస్వతీ అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ఏడాది కూడా వసంత పంచమి వేడుకల్లో పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. పంచమి వేడుకల్లో మూడో రోజైన సోమవారం భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముంది. అధికారులు స్పందించి భక్తుల సంఖ్యకు తగినట్లు ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

**భారీ సంఖ్యలో వాహనాలు**
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. వాహనాలన్నీ పార్కింగ్ స్థలంలో నిలిపి కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి వాహనాల తాకిడి మరింత పెరిగింది. రైలు మార్గం ద్వారా వచ్చిన భక్తులు అర్ధరాత్రి బాసరకు చేరుకున్నారు. మరోవైపు బస్సుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వస్తూనే ఉన్నారు. వసంత పంచమి శుభఘడియల్లో పిల్లలకు అక్షర శ్రీకార పూజలు చేయించేందుకు ఆసక్తి చూపారు. సినీ నిర్మాత దిల్‌రాజు కుటుంబ సమేతంగా బాసరకు చేరుకున్నారు. తన కుమారుడికి అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్**
బాసర ఆలయాన్ని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల రాత్రి సందర్శించారు. దేవస్థానం, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ పవన్‌చంద్ర, వేదపండితుడు నవీన్‌శర్మతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరాతీశారు. సోమవారం భక్తుల రద్దీ పెరగనున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

### పటిష్ట పోలీస్ బందోబస్తు

నిర్మల్‌టౌన్: బాసరలో నిర్వహిస్తున్న వసంత పంచమి ఉత్సవాల కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఎస్పీలు ఉపేంద్రారెడ్డి, అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనాతోపాటు 10మంది సీఐలు, 22 మంది ఎస్సైలు, ముగ్గురు మహిళా ఎస్సైలు, 15మంది ఏఎస్సైలు, 200 మంది సిబ్బంది, 50 మంది మహిళా సిబ్బంది, 64 మంది హోంగార్డులు బందోబస్తు విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. స్నానఘట్టాల వద్ద, గోదావరి తీరం, ప్రసాదాల కౌంటర్ల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



అక్షరాభ్యాస మండపంలో భక్తులు



ఆలయంలో క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

# లెక్క తేలింది

- జిల్లాలో 91వేల మందికి పక్కా ఇళ్లు లేవు
- మరో 28వేల మందికి జాగ కూడా కరువు
- అద్దె ఇళ్లలో నివసించేవారే అధికం
- 'ఇందిరమ్మ'పై పేదల్లో గంపెడాశలు



భుక్తాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లాలో పక్కా ఇళ్లు, ఇంటి స్థలాలు లేనివారి లెక్క తేలింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో ప్రజలు అందించిన దరఖాస్తులపై ఈ ఏడాది జనవరి 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ ఉద్యోగులు వారి లెక్క తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 91,594 మంది ఇంటి స్థలాలు కలిగి ఉన్నా పక్కా ఇళ్లు లేనట్లుగా గుర్తించారు. మరో 28,927 మందికి ఇంటి స్థలాలు కూడా లేవని నిర్ధారించారు. వీరిలో అత్యధిక కుటుంబాలు అద్దె ఇళ్లలో ఉంటూ కాలం వెల్లదీస్తున్నట్లు గమనించారు. వీరంతా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులుగా తేల్చారు. అయితే ప్రభుత్వం తొలివిడతలో జిల్లాలో కేవలం 7,400 ఇళ్లను మాత్రమే మంజూరు చేస్తామని ప్రకటించింది. దీంతో ప్రభుత్వ సాయం కోసం వీరంతా గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులో ఎంపికయ్యే లబ్ధిదారులేవరనేది ఆసక్తికరంగా మారింది.

**పట్టణంలోనే అత్యధికం ...**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే 2023 డిసెంబర్ 28 నుంచి 6 జనవరి 2024 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో అభయహస్తం పేరిట ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులను స్వీకరించింది. వీటిలో ఇందిరమ్మ ఇంటి పథకం ఒకటి. దీని కోసం జిల్లా వ్యాప్తంగా 1,97,448మంది దరఖాస్తు చేసుకున్నారు. సంక్రాంతి కానుకగా పేదలకు ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులపై గత నెల 16నుంచి 20వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. ఇంటిస్థలం ఉండి పక్కా ఇళ్లు లేని వారు, ఇంటి స్థలం లేనటువంటి వారిని గుర్తించింది. ఇలాంటి వారు అత్యధికంగా ఆదిలాబాద్ పట్టణ పరిధిలోనే ఉన్నట్లుగా నిర్ధారించారు. వీరు ఎక్కువగా అద్దె ఇళ్లలో నివసిస్తున్నట్లుగా గుర్తించారు.

**మండలాల్లో ఇదీ పరిస్థితి..**
ఇంటి స్థలం కలిగి పక్కా ఇళ్లు లేని వారు జైనథ్ మండలంలో అత్యధికంగా ఉన్నట్లుగా తేలింది. అత్యల్పంగా ఇంటి స్థలాలు లేని వారు సిరికొండ మండలంలో ఉండగా, ఇంటిస్థలం ఉండి పక్కా ఇళ్లులేని వారు మావలలో అత్యల్పంగా ఉన్నట్లుగా గుర్తించారు.

ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో గుర్తించిన అర్హుల వివరాలు

| మండలం | ఇంటిస్థలం ఉండి ఇళ్లులేనివారు | ఇంటిస్థలం లేనివారు |
|---|---|---|
| జైనథ్ | 8,804 | 2,145 |
| ఆదిలాబాద్‌అర్బన్ | 8,313 | 12,031 |
| ఉట్నూర్ | 7,272 | 2,445 |
| తలమడుగు | 6,189 | 827 |
| ఇంద్రవెల్లి | 6,055 | 717 |
| బేల | 5,945 | 1,550 |
| బోథ్ | 5,829 | 1,644 |
| ఆదిలాబాద్‌రూరల్ | 5,668 | 1,373 |
| ఇచ్చోడ | 5,482 | 1,345 |
| బజార్‌హత్నూర్ | 5,077 | 508 |
| గుడిహత్నూర్ | 4,640 | 987 |
| భీంపూర్ | 4,634 | 548 |
| నార్నూర్ | 4,102 | 488 |
| నేరడిగొండ | 3,661 | 1,139 |
| గాదిగూడ | 3,251 | 362 |
| సిరికొండ | 3,120 | 176 |
| తాంసి | 2,823 | 458 |
| మావల | 729 | 184 |

### లబ్ధి ఎందరికో..?

తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి మాత్రమే ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇప్పట్లో అందరికీ అందే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే తొలి విడతలో జిల్లాలో 7,400 ఇళ్లు మాత్రమే మంజూరు చేయనుంది. అర్హులైన వారు మాత్రం 91వేలకు పైగా ఉన్నారు. మరోవైపు మున్సిపల్ పరిధిలో, పలు మండలకేంద్రాల్లో నిర్మాణాలు పూర్తయి చిన్నపాటి మరమ్మతులు, మౌలిక సౌకర్యాలు అవసరమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పేదలకు అందిస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీంతో మరో వెయ్యి మందికి లబ్ధి చేకూరే అవకాశముంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 17 గ్రామాల్లో మాత్రమే ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయగా మిగతా గ్రామాల్లో ఎవరికి లబ్ధి చేకూరుతుందోనని అర్హులైన వారు టెన్షన్ నెలకొంది. ఈ నెలాఖరు నాటికి ఆయా గ్రామాల్లోనూ లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశమున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే ఇంటిస్థలం లేనటువంటి తమకు కూడా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని పేదలు కోరుతున్నారు.

# కౌలు రైతులకు ఏదీ 'భరోసా'?

- మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్
- 'రైతు భరోసా'లో మాత్రం గుర్తించని ప్రభుత్వం

జిల్లాలో కౌలు రైతులు..: 28,763

గడిచిన ఏడాదిలో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులు: 80



దుక్కి దున్నుతున్న కౌలురైతు

బోథ్: కౌలు రైతులను ప్రభుతాలు విస్మరించినట్టే కనిపిస్తోంది. సొంత భూమి ఉండదు.. బ్యాంకుకు వెళితే రూపాయి రుణం పుట్టదు. కుటుంబం గడవాలంటే తెలిసింది వ్యవసాయం ఒక్కటే. అప్పో సప్పో చేసి భూములు కౌలుకు తీసుకుంటున్నారు. సాగులో ఎన్ని ఆటంకాలు వచ్చినా, నష్టాలు ఎదురైనా భరిస్తున్నారు. సరైన దిగుబడి రాక, వచ్చినా మద్దతు ధర అందక అప్పుల పాలవుతున్నారు. ఈ క్రమంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అయినా సర్కారు నుంచి వీరికి ఎలాంటి సాయం అందని పరిస్థితి. వ్యవసాయం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కూడా రైతులుగా గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు.

**కాంగ్రెస్ ఎన్నికల హామీ..**
కౌలు రైతులకు సైతం 'రైతు భరోసా' అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అయితే ఇటీవల రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం కౌలు రైతుల అంశాన్ని మాత్రం ప్రస్తావించలేదు. కేవలం పట్టాలు ఉన్న వారికే 'భరోసా' అని పేర్కొంది. అయితే పెట్టుబడి సాయం అందక అప్పుల పాలై జిల్లాలో సుమారు 80 మంది వరకు కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తమను కూడా పరిగణలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కౌలు రైతులు కోరుతున్నారు.

### కౌలు రైతులను ఆదుకోవాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందించాలి. అలాగే ఇతరత్రా ప్రోత్సాహకాలు వర్తింపజేయాలి. ఏటా కౌలు రేటు పెరుగుతుండడం, మరోవైపు దిగుబడి లేక మద్దతు ధర అందక కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టి వారిని ఆదుకోవాలి.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

## క్లుప్తంగా

### నాగోబా జాతరకు వెళ్లివస్తూ ఒకరు మృతి

**ఇచ్చోడ:** ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన మడావి రాజు(30) తన స్నేహితుడు తులసీరాంతో కలిసి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నాగోబా జాతరకు వెళ్లి వస్తుండగా 44వ జాతీయ రహదారిపై దూబార్‌పేట్ వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తూ సడన్‌గా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాజు మృతి చెందాడు. మృతుని సోదరి శకుంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్టు

**ఆదిలాబాద్‌టౌన్:** కులం పేరుతో దూషించిన సామల ప్రశాంత్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లికి చెందిన యువజన సంఘాల అధ్యక్షుడు బాలశంకర్ బాధితుడు కృష్ణను కులం పేరుతో దూషించడంతో పాటు సెల్‌ఫోన్‌లో అసభ్యకర మెస్సేజ్‌లు పెట్టినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### బొలెరో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం సబ్బెపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ మండలం వేలాల గ్రామానికి చెందిన సంతోశ్ ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలకు వస్తుండగా మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఘటనలో సంతోశ్ తలకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



108లో ఆస్పత్రికి వెళ్తున్న క్షతగాత్రులు

**ఇంద్రవెల్లి:** ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, 108 పైలెట్ ఆత్రం అశోక్, ఈఎంటీ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలంలోని ఓడిని గ్రామానికి చెందిన సురాజ్, తేజష్, విక్రం శనివారం రాత్రి కేస్లాపూర్ నాగోబా జాతరకు వెళ్లి వస్తుండగా ముత్నూర్, కేస్లాపూర్ గ్రామాల మధ్య గుడిహత్నూర్ మండలంలోని మర్కగూడకు చెందిన ఆటో ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. తేజష్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ముత్నూర్ నుండి కేస్లాపూర్ వరకు రోడ్డుపై ఉన్న గుంతల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# ‘ఎమ్మెల్సీ’కి నామినేషన్లు!

- సిద్ధమవుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రులు
- 7న నామినేషన్ వేయనున్న నరేందర్‌రెడ్డి
- తొలిరోజు నామినేషన్లకు రవీందర్‌సింగ్ సన్నాహాలు
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని బీఆర్‌ఎస్
- గ్రాడ్యుయేట్ గులాబీ ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణ?

షెడ్యూల్ ఇలా..!

| | |
|---|---|
| 1. నోటిఫికేషన్ విడుదల | 03-02-2025 |
| 2. నామినేషన్ల చివరితేదీ | 10-02-2025 |
| 3. నామినేషన్ల స్క్రూటినీ | 11-02-2025 |
| 4. విత్‌డ్రాలకు చివరితేదీ | 13-02-2025 |
| 5. పోలింగ్ తేదీ | 27-02-2025 |
| 6. ఓట్ల లెక్కింపు | 03-03-2025 |
| 7. ఎన్నికల ప్రక్రియపూర్తి | 08-03-2025 |



కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** కరీంనగర్ – మెదక్–నిజామాబాద్ – ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ నామినేషన్లకు రంగం సిద్ధమైంది. కరీంనగర్ కేంద్రంగా జరిగే జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కలెక్టర్ పమేలా సత్పతి ఆర్వోగా వ్యవహరిస్తారు. నేడు ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడనుంది. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం 11వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 13గా నిర్ణయించారు. 27వ తేదీన పోలింగ్ జరగనుంది. మార్చి 03న ఓట్ల లెక్కింపు జరగనుంది. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. 15 జిల్లాలు, 42 నియోజకవర్గాలు ఎన్నికల కోడ్‌లోకి వచ్చాయి. ఆయా ప్రాంతాల నుంచి పలువురు నేతలు కరీంనగర్‌కు వచ్చి నామినేషన్లు వేసేందుకు రానుండగా.. ఈ మేరకు కలెక్టరేట్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

**నేతల ఏర్పాట్లు..!**

తాజాగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో ఆయన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల7న ఆయన నామినేషన్ వేస్తారని సమాచారం. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారని సమాచారం. 10న నరేందర్ రెడ్డికి మద్దతుగా మరో ర్యాలీ జరగనుంది. అందులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారు. మరో అభ్యర్థి ప్రసన్న హరికృష్ణతో బీఆర్‌ఎస్ నేతలు మంతనాలు సాగిస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన గులాబీ పార్టీలో చేరతారా? లేక స్వతంత్రంగా బరిలో ఉంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**ఉద్యమ నాయకులకు మొండిచేయి..!**

అదే సమయంలో డా.బీ.ఎన్ రావు , మాజీ మేయర్ రవీందర్ సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు స్వతంత్రంగా బరిలో ఉంటారని సమాచారం. వీరిలో రవీందర్ సింగ్, శేఖర్‌రావు ఉద్యమ నాయకులు అయినా తమకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా ఉద్యమనేత నిజామాబాద్‌కు చెందిన రాజారాం యాదవ్‌కు కూడా ఈ విషయంలో నిరాశ మిగిలింది. ఇక బీజేపీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ అభ్యర్థి మల్క కొమురయ్య నామినేషన్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరి నామినేషన్లకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితోపాటు మరికొందరు కీలక నేతలు హాజరుకానున్నారు. ప్రభుత్వ అధ్యాపక జేఏసీ, ఎస్టీయూ టీఎస్, టీపీఆర్టీయూలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి, సిట్టింగ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తమరెడ్డి కూడా రెండురోజుల్లో నామినేషన్ వేయనున్నారు. మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నా.. బరిలో దిగే విషయంలో సందిగ్ధం నెలకొంది. అదే విధంగా పీఆర్‌టీయూ బలపరిచిన వంగా మహేందర్‌రెడ్డి, ఎస్టీయూ నుంచి సంకినేని మాధవరావు కూడా బరిలో ఉన్నారు. టీపీటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన వై.అశోక్‌కుమార్ నామినేషన్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరి భవితవ్యాన్ని 3,58,614 మంది గ్రాడ్యుయేట్లు, 28,672 మంది టీచర్లు నిర్ణయించనున్నారు.



వి.నరేందర్‌రెడ్డి, (కాంగ్రెస్)



అంజిరెడ్డి (బీజేపీ)



కూర రఘోత్తమరెడ్డి



అశోక్‌కుమార్



సర్దార్ రవీందర్‌సింగ్



మల్క కొమురయ్య

### నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలో రూ.500 నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. తానూరు మండలం బొంద్రాత్ గ్రామానికి చెందిన షేక్ ఖాదీర్ స్థానిక మంజులాపూర్ ఆటోస్టాండ్ వద్ద కూరగాయలు విక్రయిస్తున్న దొంగరీ వంశీ వద్దకు వచ్చాడు. అతని వద్ద రూ.140 కూరగాయలను కొనుగోలు చేసి రూ.500 నోటు అందించాడు. నోటు తేడాగా కనిపించడంతో వేరేది ఇవ్వమని అడగగా అతనితో గొడవకు దిగాడు. పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై అశోక్ అక్కడికి చేరుకుని నోటును పరిశీలించగా నకిలీదని తేలింది. అతని విచారించగా తనతో పాటు బస్టాండ్ వద్ద ఉన్న మరోవ్యక్తి వద్ద కూడా నకిలీనోట్లు ఉన్నట్లు తెలిపాడు. షేక్ ఖాదీర్ వద్ద ఉన్న 40 నోట్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నాడు. మరో వ్యక్తిని విచారించగా అతని పేరు సోంకేడి సురేష్ అని తెలిపాడు. అతని వద్ద నుంచి 43 నోట్లు, ఫోన్ స్వాధీనం చేసుకున్నాడు. ఇద్దరిని విచారించగా మహారాష్ట్రలోని పర్భాని తాలూకా పోకర్ని గ్రామానికి చెందిన సందీప్ వద్ద కొనుగోలు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# ట్రిపుల్‌ఐటీలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

**భైంసా:** బాసర ట్రిపుల్‌ఐటీలో పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వెహికిల్ పరిశ్రమ కోసం భవిష్యత్ ఇంజనీర్లను రూపొందించడంలో ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎలక్ట్రానిక్స్ వెహికిల్ చార్జర్లు, డ్రైవ్ రైళ్లు, పవర్ కన్వర్టర్, టెక్నాలజీలపై ఈ సదస్సులో వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ మురళీదర్శన్, ఏవో రణధీర్‌సాగీ, కోఆర్డినేటర్‌లు లక్ష్మణ్, ముత్యం, వినయ్‌కుమార్, హెచ్‌వోడీ బావుసింగ్, ఎస్.రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో ఆగని చోరీలు..!



సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యం

**భైంసాటౌన్:** భైంసా పట్టణంలో చోరీలు నిత్యకృత్యమయ్యాయి. ఆలయాలు, ఇళ్లు, దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. శనివారం రాత్రి దాటిన తర్వాత భైంసా–నిర్మల్ రహదారిలో గల ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో ఓ ఆన్‌లైన్ డెలివరీ బ్రాంచ్ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. స్థానిక పులేనగర్‌లో ఓ ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో పోలీసు బందోబస్తు ఉన్నా చోరీలు ఆగకపోవడం పట్టణ వాసులను కలవరపాటుకు గురిచేస్తోంది.

### యువకుడు బలవన్మరణం



పవన్ కళ్యాణ్(ఫైల్)

**కోటపల్లి:** ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల మేరకు చెన్నూర్ పట్టణంలోని మహంకాళి వాడకు చెందిన మాదాసు రాజన్న, రాజేశ్వరి దంపతుల కుమారుడు మాదాసు పవన్ కళ్యాణ్ (24) స్థానికంగా ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం కోటపల్లి మండలంలోని రాంపూర్‌లో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. కొంతసేపటికి బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన యువకుడు నోట్లో నుంచి నురగలు కక్కుతుండడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. అయితే సదరు యువకుడు ఆన్‌లైన్లో షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడుతుండేవాడని, పెద్దమొత్తంలో డబ్బులు పోగొట్టుకోవడంతోనే కలతచెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి ఫిర్యాదు చేశాడు.

### పురుగుల మందు తాగి ..

**లింగాపూర్:** పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల మేరకు వంజరిగూడకు చెందిన అవినాష్ (19) చదువు మధ్యలో మానేసి రెండేళ్లుగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని తండ్రి హన్మంతు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. గతనెల 31న ఇంట్లోనే గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జైనూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### శివాలయంలో చోరీ

**జైపూర్:** మండలంలోని పెగడపల్లిలో అతి పురాతనమైన శివాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఊరికి చివరగా ఉన్న శివాలయంలో గుర్తు తెలియని దుండగులు గుడి తాళం పగులగొట్టి శివలింగంపై ఉన్న రెండు వెండి పగడాలు, పార్వతి అమ్మవారి విగ్రహంపై ఉన్న జత బంగారు పుస్తెలు(అరతులం) అపహరించారు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ఆలయ అర్చకులు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

### ఇంట్లో చోరీ

**ఆదిలాబాద్‌టౌన్:** పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ఏరియాకు చెందిన మహ్మద్ అజర్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బాధితుడు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లగా రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు టీవీ ఎత్తుకెళ్లారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### కప్పర్లలో ముగిసిన అంత్యక్రియలు

**తాంసి:** మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలతో పాటు యువతి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. మృతి చెందిన ఆకుల రాకేష్ (35), స్పందన(19) మృతదేహాలను ఆదివారం పోలీసులు పోస్టుమార్టం అ నంతరం బంధువులకు అప్పగించగా కప్పర్లలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అందరి తో కలివిడిగా ఉండే రాకేష్ ఆత్మహత్యకు పాల్పడటంతో కప్పర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.






- నాగోబా జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు

# పోటెత్తిన భక్తజనం



జనజాతరగా మారిన నాగోబా ప్రాంతం



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మెస్రం వంశీయులు



నాగోబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

**ఇంద్రవెల్లి:** పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని గత నెల 28న ప్రారంభమైన కేస్లాపూర్ నాగోబా జాతర కొనసాగుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి నాగోబాను దర్శించుకున్నారు. మాజీమంత్రి జోగు రామన్నతో పాటు పలువురు ప్రముఖులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో జాతర పరిసర ప్రాంతం జనసంద్రంగా మారింది. భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద సామగ్రి కొనుగోలు చేశారు. రంగులరాట్నాలు, సర్కస్‌ల వద్ద యువతీ యువకులు, చిన్నారులు సందడి చేశారు. అధికారికంగా ఈ నెల 4వ తేదీ వరకు నాగోబా జాతర కొనసాగుతుందని ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పుజారి మెస్రం శేఖు, మెస్రం వంశం ఉద్యోగులు దేవ్‌రావ్, శేఖర్‌బాబు, సోనేరావ్, మెస్రం వంశీయులు దేవ్‌రావ్, నాగ్‌నాథ్, తుకారాం, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం**

జాతరలో భాగంగా నాగోబా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు ఆదివారం మెస్రం వంశీయుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి ఇచ్చోడ మండలంలోని బురదపల్లి జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి ఇంద్రవెల్లి మండలంలోని దొడంద జట్టుకు రూ.10 వేలు, తృతీయ బహుమతి ఆదిలాబాద్ మండలంలోని దావెన్‌గూడ జట్టుకు రూ.5 వేలు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి మంచిర్యాల జిల్లా దేవాపూర్ జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ జట్టుకు రూ.10 వేలు, తృతీయ బహుమతి ఇంద్రవెల్లి మండలంలోని మల్లాపూర్ జట్టుకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్, మెస్రం వంశ పెద్దలు మెస్రం మనోహర్, మెస్రం కోసేరావ్, మెస్రం నాగ్‌నాథ్, నాగోబా యూత్ అధ్యక్షుడు రాము, సభ్యులు పాల్గొన్నారు.

# పులి రాక కోసం..

- జిల్లాలో బెబ్బులి సంచారంతో అటవీ అధికారులు అప్రమత్తం
- టైగర్‌జోన్ పరిధిలో ఆటంకాలు లేకుండా తనిఖీలు



భర్తన్‌పేట్ బీట్‌లో పరిశీలిస్తున్న రేంజ్ అధికారి, సిబ్బంది

**జన్నారం:** పులి రాకకోసం అటవీశాఖ అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల బెల్లంపల్లి, వేమనపల్లి, తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి జన్నారం అటవీ డివిజన్‌లోనే ఆవాసం ఏర్పర్చుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నా లుగేళ్లుగా రాకపోకలతోనే సరిపెడుతున్న పులి ఇ క్కడే ఉండేలా తగు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్‌లోని అటవీ రేంజ్‌లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతున్నారు. 2024 సెప్టెంబర్‌లో పైడిపెల్లికి చెందిన ఓ రైతు ఆవులపై దాడి చేసిన పులి అప్పటి నుంచి ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లలో పర్యటించినట్లు కెమెరాకు చిక్కింది. అక్కడి నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికైనా ఈ ప్రాంతంలో ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అలజడి లేకుండా**

20 డిజిబుల్ శబ్దం వచ్చినా పులికి వినిపిస్తుందని, అందుకే అలజడి ఉన్నచోట పులి ఉండదని అధికా రులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జన్నారం అటవీ డివిజన్‌లోని పలు అటవీ బీట్‌లలో పశువులు, మనుషుల సంచారం లేకుండా చర్యలు చేపడుతున్నారు. పులి సంచరించే ట్రాక్‌లో ఎలాంటి శబ్దం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. టైగర్ మానిటరింగ్ చేస్తూ ట్రాక్‌ను క్లియర్ చేస్తున్నారు.

**ఇందన్‌పల్లి రేంజ్‌లో పరిశీలన**

ఫారెస్ట్ మార్చ్‌లో భాగంగా అధికారులు రేంజ్ పరిధిలోని అటవీ బీట్‌లలో పర్యటిస్తూ ఉచ్చులు, కరెంటు తీగలు, వలలు, తదితర ప్రాణాంతక పరికరాలు తనిఖీ చేస్తున్నారు. అలాంటివి ఉంటే ముందుగా తొలగిస్తూ అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జన్నారం బీట్‌లో ఉచ్చులు అమర్చిన ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేశారు. ఎప్పటికప్పుడు టైగర్ ట్రాక్‌ను పరిశీలిస్తూ పులి ఆవాసం ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**15 కిలోమీటర్లు కాలినడకన..**

ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో ఫారెస్ట్ మార్చ్ నిర్వహించి సిబ్బందితో కలిసి 15 కిలోమీటర్లు కాలినడకన టైగర్ ట్రాక్ పరిశీలించినట్లు రేంజ్ అధికారి తెలిపారు. కల్పకుంట నుంచి మొదలు కవ్వాల్ అటవీ సెక్షన్‌లోని రాగికుంట వరకు వాగులు, దారులు పరిశీలించి అవాంతరాలు లేకుండా చూసినట్లు అధికారులు తెలిపారు.

**తచ్చాడుతున్న పులి..**

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి శివారు కన్నాల అటవీ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి పులి సాహసించడం లేదు. పెద్ద బుగ్గ, చిన్న బుగ్గ మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో తిష్టవేసి విరామం లేకుండా సంచారం చేస్తోంది. అటవీ ప్రాంతాన్నీ అణువణువు తిరుగుతోంది. మరో ప్రాంతానికి వెళ్లడానికి అయిష్టత చూపుతోంది. చిన్నబుగ్గ అటవీప్రాంతం నుంచి నీలగిరి తోటవైపు నుంచి బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని దాటి గోండుగూడెం వైపు కొంతదూరం అడుగులు వేయడం, వెనక్కి రావడం చేస్తోంది. దీంతో బుగ్గ దేవాలయానికి వెళ్లే మార్గాన్ని అటవీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎనిమల్ ట్రాకింగ్ సిబ్బంది కన్నాల గ్రామానికి వెళ్లే చౌరస్తా వద్ద మాటువేసి రాకపోకలు సాగకుండా చెట్ల కొమ్మలు నరికి అడ్డంగా పెట్టారు. ముఖ్యమైన ఐదు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పులి వాటికి చిక్కడంలేదు. అల్లంత దూరం నుంచి వెళ్తున్నట్లు తాజాగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ పర్యవేక్షణలో పహారా కాస్తున్నారు.